## మూడవ ప్రకరణం

# నిజ విశ్వాసం పట్ల వైముఖ్య ధోరణి : తీసుకోవలసిన జాగ్రత్తలు

నిజ విశ్వాసం పట్ల విముఖత లేక పలాయనం వినాశానికి హేతువు. ఎందుకంటే నిజ విశ్వాసమే ప్రయోజనకరమైన ఆచరణకు బలవత్తరమైన ప్రేరకం. నిజ విశ్వాసాన్ని వీడిన మనిషి సంశయాలకు, మూఢ నమ్మకాలకు లోనైపోతాడు. కొన్నిసార్లు ఈ మూఢ నమ్మకాల అంధకారం అతనిపై దట్టంగా అలుముకుని సుఖసౌఖ్యాలతో జీవించే అతని శక్తిసామర్థ్యాలను సయితం కబళించివేస్తుంది. కడకు అతని బ్రతుకు అతని కొరకు దుర్భరమైపోతుంది. చివరకు అతను తన జీవితాన్ని చాలించి ఈ దుర్భరస్థితి నుండి విముక్తి పొందాలనుకుంటాడు. ఆఖరికి ఆత్మహత్యకైనా వెనుకాడడు. నేడు నిజ విశ్వాసాల మార్గదర్శనానికి నోచుకోకుండా ఉన్న చాలామంది పరిస్థితి ఇదే. నిజ విశ్వాసాల ప్రాబల్యం లేని సమాజం పశుప్రాయమైన సమాజమే. అటువంటి సమాజంలో సౌభాగ్యవంతమైన జీవితానికి కావలసిన కారకాలన్నీ చచ్చుబడిపోయి ఉంటాయి. ఆ సమాజంలో భౌతిక జీవితానికి కావలసిన ఒనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ అవి చాలావరకు మనిషిని వినాశం వైపు నెట్టివేస్తూ ఉంటాయి. అవిశ్వాసుల సమాజంలో ఇలాంటి పెక్కు ఉదాహరణలు లభిస్తాయి. ఎందుకంటే సమాజంలోని భౌతిక కారకాలకు, ఒనరులకు సరైన దిశా నిర్దేశం చేసినపుడే వాటిద్వారా లబ్ది చేకూరుతుంది. నిజ విశ్వాసం తప్ప మరే ఇతర వస్తువూ వాటికి సరిగ్గా దిశానిర్దేశం చేయజాలదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿يَا أَيُّهَا الرُّسُلُ كُلُوا مِنَ الطَّيِّبَاتِ وَاعْمَلُوا صَالِحاً﴾ (المؤمنون:٥١)

**"ఓ ప్రవక్తలారా! పరిశుద్ధ వస్తువులు తినండి. సదాచరణ చేయండి." (అల్ మోమినూన్ : 51)**

ఇంకా ఈ విధంగా ఉపదేశించాడు :

﴿وَلَقَدْ آتَيْنَا دَاوُودَ مِنَّا فَضْلاً يَا جِبَالُ أَوِّبِي مَعَهُ وَالطَّيْرَ وَأَلَنَّا لَهُ الْحَدِيدَ ☆ أَنِ اعْمَلْ سَابِغَاتٍ وَقَدِّرْ فِي السَّرْدِ وَاعْمَلُوا صَالِحاً إِنِّي بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ☆ وَلِسُلَيْمَانَ الرِّيحَ غُدُوُّهَا شَهْرٌ وَرَوَاحُهَا شَهْرٌ وَأَسَلْنَا لَهُ عَيْنَ الْقِطْرِ وَمِنَ الْجِنِّ مَن يَعْمَلُ بَيْنَ يَدَيْهِ بِإِذْنِ رَبِّهِ وَمَن يَزِغْ مِنْهُمْ عَنْ أَمْرِنَا نُذِقْهُ مِنْ عَذَابِ السَّعِيرِ ☆ يَعْمَلُونَ لَهُ مَا يَشَاءُ مِن مَّحَارِيبَ وَتَمَاثِيلَ وَجِفَانٍ كَالْجَوَابِ وَقُدُورٍ رَّاسِيَاتٍ اعْمَلُوا آلَ دَاوُودَ شُكْراً وَقَلِيلٌ مِّنْ عِبَادِيَ الشَّكُورُ﴾ (سبا:١٠-١٣)

**ఇంకా మేము దావూదుకు మా తరఫు నుండి గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదించాము. "ఓ పర్వతాల్లారా! అతనితో కలసి స్తోత్రగానం చేయండి" (అని ఆజ్ఞాపించాము). పక్షులను కూడా (ఇదేవిధంగా ఆదేశించాము). ఇంకా అతని కొరకు మేము ఇనుమును మెత్తబరిచాము. "పరిపూర్ణమైన కవచాలను నిర్మించు. వాటి కడియాలను తగువిధంగా అమర్చు. ఇంకా మీరంతా సదాచరణ చేయండి. మీరు చేస్తున్నదంతా నేను గమనిస్తున్నాను" అని ఆదేశించాము. ఇంకా – మేము సులైమాను కోసం గాలిని అదుపులో ఉంచాము. దాని ప్రొద్దుటి (ప్రమాణ) గమ్యం ఒక మాసానికి, సాయంత్రపు గమ్యం కూడా ఒక మాసానికి సమానంగా ఉండేది. ఇంకా – మేము అతని కొరకు కరిగిన రాగి ఊటను ప్రవహింపజేశాము. ఇంకా – అతని ప్రభువు ఆజ్ఞపై జిన్నాతులు అతని చెప్పుచేతల్లో ఉండి, అతని ముందరే పనిచేసేవి. వారిలో ఎవరు మా ఆజ్ఞలను ఉల్లంఘించినా మేము వాడికి జ్వలించే అగ్ని శిక్షను చవిచూపిస్తాము. వారు (ఆ జిన్నులు) అతని కోసం అతను కోరినదల్లా చేసిపెట్టేవారు. ఎత్తయిన కట్టడాలు, ప్రతిమలు, కోనేరుల్లాంటి గంగాళాలు, పొయ్యిలపైనే స్థిరంగా ఉండే దేగిశాలు. "ఓ దావూదు కుటుంబీకులారా! ఇందుకు కృతజ్ఞతగా సదాచరణ చెయ్యండి." నా దాసులలో కృతజ్ఞతాపూర్వకంగా మసలుకునేవారు బహుకొద్దిమంది మాత్రమే. (సబా : 10 –13)**

అందుకే భౌతిక శక్తితో పాటు విశ్వాస శక్తి కూడా ఎంతో అవసరం. ఎందుకంటే వైముఖ్య ధోరణి మూలంగా ఈ శక్తి గనక అధర్మ విశ్వాసాల వైపు ఆకర్షించబడి, భౌతిక శక్తి నుండి వేరుపడిపోతే, ఆ భౌతిక శక్తి పతనానికి, వినాశానికి సాధనంగా పరిణమిస్తుంది. నేడు మనం ధర్మరాహిత్య, అవిశ్వాస దేశాలను చూస్తున్నాం. అవి భౌతికంగా కళ్లు చెదిరే ప్రగతిని సాధించాయి. కాని అవి నిజ విశ్వాస భాగ్యానికి నోచుకోలేకపోయాయి.

నిజ విశ్వాసం పట్ల విముఖతకు పలు కారణాలున్నాయి. వాటిని గురించి తెలుసుకోవటం ఎంతైనా అవసరం. వాటిలో కొన్నింటిని ఇక్కడ పొందుపరుస్తున్నాము–

## (1) నిజ విశ్వాసం గురించి తెలీక పోవటం :

నిజ విశ్వాసాలను గురించి తెలుసుకునే జిజ్ఞాస సన్నగిల్లటం, లేదా వాటిపట్ల తగు శ్రద్ధ కనబరచకపోవటంచేత నిజ విశ్వాసమంటే ఏమిటో తెలియని పరిస్థితి

ఏర్పడుతుంది. ఈ జ్ఞానలేమి విముఖతకు దారితీస్తుంది. కడకు ఒక నవతరం ఉనికిలోనికి వస్తుంది. దానికి నిజ విశ్వాసమంటే ఏమిటో, అది ఏ ఏ విషయాల నుండి వారిస్తుందో బొత్తిగా తెలిసి ఉండదు. తత్ఫలితంగా అది ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా భావిస్తుంది. హ॥ఉమర్ బిన్ ఖత్తాబ్ (رضي الله عنه) చెప్పినట్లు –

**"ఇస్లాంలో అజ్ఞానం యొక్క చెడుగులను పసిగట్టలేని జనులు పుట్టుకు వచ్చినపుడు ఇస్లాం యొక్క ఒక్కొక్క శృంఖలం తెగిపోతుంది."**

## (2) తాతల తండ్రుల వైఖరి కోసం :

దీనికోసం దురభిమానంతో వ్యవహరించటం. తమ పూర్వీకుల వైఖరి అధర్మమైనదని తెలిసి కూడా దానిపైనే పాతుకుపోవటం. వారి వైఖరికి ప్రతికూలంగా ఉన్న ప్రతిదానినీ – అది సత్యబద్ధంగానే ఉన్నప్పటికీ – విడనాడటం! ఆ విషయాన్నే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ نَتَّبِعُ مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا أَوَلَوْ كَانَ آبَاؤُهُمْ لَا يَعْقِلُونَ شَيْئًا وَلَا يَهْتَدُونَ﴾ (البقرة:١٧٠)

**"అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, 'మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూసిన పద్ధతినే మేము పాటిస్తాము' అని వారు సమాధానమిస్తారు. వారి పూర్వీకులు ఒట్టి అవివేకులు, మార్గవిహీనులైనప్పటికీ (వీళ్లు వారినే అనుసరిస్తారన్నమాట!)." (అల్ బఖర : 170)**

## (3) అంధానుసరణ :

సరైన ఆధారాలు, నిదర్శనాలను గురించి తెలుసుకోకుండానే అఖీదా విషయంలో లోకుల మాటలను గుడ్డిగా నమ్మటం. వారు చెప్పినట్లుగా చేయటం! ఉదాహరణకు : ఖుర్ఆన్ హదీసులకు వ్యతిరేకంగా వ్యవహరించిన జహ్మియ, మోతజిల, అషాఅర, సూఫీ తదితర వర్గాలవారు. ఆ వర్గాల వారు తమ పూర్వీకుల్లోని మార్గవిహీన నాయకులను గుడ్డిగా అనుసరించారు. తత్ఫలితంగా వారు మార్గభ్రష్టులైనారు. నిజ విశ్వాసాలకు బహుదూరం వెళ్ళిపోయారు.

## (4) ఔలియాల, మహనీయుల ప్రేమలో అతిశయిల్లటం, వారిని వారి స్థాయి నుండి మరింత పైకి ఎత్తటం

అదెలాగంటే, అల్లాహ్ మాత్రమే చేయగల పనులను ఈ సత్పురుషులు కూడా

చేస్తారని నమ్మి నడుచుకోవటం. ఉదాహరణకు : లాభం చేకూర్చటం, నష్టం నుండి కాపాడటం, అవసరాలను తీర్చటం, దుఆ స్వీకరణ విషయంలో దైవానికి – ఇతర ప్రాణులకు మధ్య వారధిని ఏర్పరచటం, క్రమక్రమంగా ఈ 'వాస్తా' శ్రుతి మించుతుంది. నిజ దైవాన్ని వదలి దైవేతరులను పూజించేదాకా పోతుంది. మొక్కుబడులు తీర్చుకోవటం, ఖుర్బానీ ఇవ్వటం, వారి సమాధుల సాన్నిధ్యం పొందేందుకు యత్నించటం, చివరికి వారినే ప్రార్థించటం – ఇలా సాగుతుంది వ్యవహారం. పూర్వం నూహ్ జాతి ప్రజలు కూడా తమ పూర్వీకుల యెడల సరిగ్గా ఇలాగే వ్యవహరించారు. ఆఖరికి వారిలా అన్నారు:

﴿وَقَالُوا لَا تَذَرُنَّ آلِهَتَكُمْ وَلَا تَذَرُنَّ وَدًّا وَلَا سُوَاعًا وَلَا يَغُوثَ وَيَعُوقَ وَنَسْرًا﴾ (نوح:٢٣)

**"ఎట్టి పరిస్థితిలోనూ మీ పూజ్య దైవాలను వదలిపెట్టకండి. వద్దను, సువానుగానీ, యగూస్, యవూఖ్ నస్రలనుగానీ వదలకండి."**

**(నూహ్ : 23)**

అంటే నేడు అనేక దేశాలలో సమాధి పూజారులు చెబుతున్నట్లే వారూ చెప్పారన్న మాట!

## (5) దేవుని సూచనలపై యోచించకపోవటం :

ఈ సువిశాల జగతిలో సర్వవ్యాప్తమై ఉన్న అల్లాహ్ సూచనలపై, ఖుర్ఆన్ సూక్తులపై చింతన చేయకపోవటం, అధిభౌతికతత్వానికి, దాని ప్రగతికి ప్రభావితమై తదనుగుణంగానే ఆలోచించటం, ఇదంతా మానవ మేధవల్లనే సాధ్యమయిందని తలపోయటం మనిషిలో అహంభావాన్ని, ఆత్మస్తుతిని పెంచిపోషిస్తుంది. ఉదాహరణకు : పూర్వం ఖారూన్ అదే మాటన్నాడు :

﴿قَالَ إِنَّمَا أُوتِيتُهُ عَلَىٰ عِلْمٍ عِندِي﴾ (القصص:٧٨)

**"ఇదంతా నాకున్న ప్రజ్ఞాపాటవాల మూలంగానే నాకు వొసగబడింది" అని (ఖారూన్) చెప్పాడు. (అల్ ఖసస్ : 78)**

మనిషి స్వభావం ఎలా ఉంటుందంటే –

﴿هَٰذَا لِي﴾ (حم السجدة:٥٠)

**"అది ఎలాగూ నాకు దక్కవలసిందే (ఆ యోగ్యత నాలో ఉంది గనక)" (హా మీమ్ అస్సజ్దహ్ : 50)**

﴿إِنَّمَا أُوتِيتُهُ عَلَىٰ عِلْمٍ﴾ (الزمر:٤٩)

**"ఇది నా ప్రతిభ మూలంగానే నాకు ప్రసాదించబడింది" అని బీరాలు పోతాడు. (అజ్ జుమర్ : 49)**

ఈ రకమయిన భావాలు గలవారు తనకిన్ని తెలివితేటల్ని ప్రసాదించిన ఆ గొప్ప సృష్టికర్త గురించి ఎన్నడూ యోచన చేయలేదు. ఆ పరమ ప్రభువు మానవుడికి అనేక రకాల ప్రత్యేకతలను వొసగటంతో పాటు వాటి ద్వారా లబ్ది పొందే ప్రజ్ఞను, దక్షతను కూడా అతనికి అనుగ్రహించాడు.

ఈ విధంగా సెలవీయబడింది :

﴿وَ اللّٰهُ خَلَقَكُمْ وَمَا تَعْلَمُوْنَ﴾ (الصافات:٩٦)

**"మరి (చూడబోతే) మిమ్మల్నీ, మీరు చేసిన వాటిని కూడా సృష్టించినవాడు అల్లాహ్‌యే కదా!" (అస్ సాఫ్ఫాత్ : 96)**

﴿أَوَلَمْ يَنظُرُوا فِي مَلَكُوتِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا خَلَقَ اللّٰهُ مِن شَيْءٍ﴾ (الاعراف:١٨٥)

**"ఏమిటి, భూమ్యాకాశాల వ్యవస్థను, అల్లాహ్ సృష్టించిన ఇతర వస్తువులను వారు గమనించలేదా?" (అల్ ఆరాఫ్ : 185)**

﴿اللّٰهُ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ وَأَنزَلَ مِنَ السَّمَاءِ مَاءً فَأَخْرَجَ بِهِ مِنَ الثَّمَرَاتِ رِزْقًا لَّكُمْ وَسَخَّرَ لَكُمُ الْفُلْكَ لِتَجْرِيَ فِي الْبَحْرِ بِأَمْرِهِ وَسَخَّرَ لَكُمُ الْأَنْهَارَ☆وَسَخَّرَ لَكُمُ الشَّمْسَ وَالْقَمَرَ دَائِبَيْنِ وَسَخَّرَ لَكُمُ اللَّيْلَ وَالنَّهَارَ☆ وَآتَاكُم مِّن كُلِّ مَا سَأَلْتُمُوهُ وَإِن تَعُدُّوا نِعْمَتَ اللّٰهِ لَا تُحْصُوهَا إِنَّ الْإِنسَانَ لَظَلُومٌ كَفَّارٌ﴾ (ابراهيم:٣٢-٣٤)

**"భూమ్యాకాశాలను సృష్టించి, ఆకాశాల నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీ ఉపాధి (ఆహారం) కోసం పండ్లు ఫలాలను ఉత్పన్నం చేసినవాడే అల్లాహ్. ఆయనే తన ఆజ్ఞతో సముద్రంలో నౌకలు నడవటానికి వాటిని మీకు లోబరిచాడు. ఆయనే నదీనదాలను మీ అధీనంలో ఉంచాడు. ఆయనే నిరంతర ప్రయాణం చేస్తూ పోతున్న సూర్యచంద్రులను మీకు లోబరచాడు. రేయింబవళ్ళను కూడా ఆయన మీ సేవకై కట్టుబడి ఉండేలా చేశాడు. మరి ఆయనే మీరు అడిగిన దానినల్లా మీకు ఇచ్చి ఉన్నాడు. మీరు అల్లాహ్ చేసిన మేళ్ళను లెక్కించదలచినా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు. మేలును మరిచేవాడు." (ఇబ్రాహీమ్: 32 – 34)**

## (6) ఎన్నో కుటుంబాలు సరైన మార్గదర్శకత్వానికి నోచుకోకపోవటం

ఇది కూడా ఒక ముఖ్య కారణమే. ఎందుకంటే నేడు ఎన్నో కుటుంబాలకు సరైన మార్గదర్శకత్వం లభించటం లేదు. ఈ నేపథ్యంలో ప్రవక్త మహాశయుల (ﷺ) వారి ప్రవచనం గమనించదగినది. ఆయన (ﷺ) ఇలా అన్నారు :

"كُلُّ مَوْلُوْدٍ يُوْلَدُ عَلَى الْفِطْرَةِ فَأَبَوَاهُ يُهَوِّدَانِهِ أَوْ يُنَصِّرَانِهِ أَوْ يُمَجِّسَانِهِ"
(بخاری:۱۳۵۸، مسلم:۲۶۵۸)

**"పుట్టే ప్రతి శిశువు సహజ ధర్మం (ఇస్లాం)పైనే పుడుతుంది. అయితే దాని తల్లిదండ్రులు దానిని యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీ (అగ్నిపూజారి) గానో తయారుచేస్తారు." (బుఖారీ 1358, ముస్లిం)**

అందుకే – పిల్లవాని భావజాలాన్ని, ఆలోచనా సరళిని తీర్చిదిద్దటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైనది.

## (7) అనేక ముస్లిం రాజ్యాలలోని ప్రసార సాధనాలు, విద్యాశాఖలు తమ గురుతర బాధ్యతను గుర్తించకపోవటం

తత్కారణంగా పాఠ్యాంశాలలో వారు ధార్మిక విషయాలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వటం లేదు. లేదా ఈ విషయాన్ని వారు బొత్తిగా ఉపేక్షిస్తున్నారు. చాలావరకు దూరవాణి, దూరదర్శన్ కేంద్రాలు వినాశ సాధనాలుగా, విశృంఖలత్వాన్ని పెంచిపోషించే విభాగాలుగా తయారయ్యాయి. లేదా అవి కేవలం వినోదాన్ని పంచిపెట్టే పరికరాలుగా మాత్రమే మిగిలిపోయాయి. నవతరంలో శీల నిర్మాణం చేసే, దిద్దుబాటు కార్యాన్ని చేపట్టే ధ్యాస ఏ కోశానా కనిపించదు. తత్కారణంగా సమాజంలో పొడసూపే వైముఖ్య ధోరణులను, విచ్చలవిడితనాన్ని అరికట్టే తరుణోపాయాలు కరువైపోతున్నాయి. దైవరాహిత్య, ధర్మరాహిత్య, నీతిరాహిత్య మూకలను నిలువరించే దక్షత గల నవతరం ఉనికిలోకి రాలేకపోతోంది.

## ఈ వైముఖ్య దశ నుండి కాపాడుకునే మార్గమేది?

(1) నిజ విశ్వాస ప్రాప్తికై దైవగ్రంథం, దైవప్రవక్త (ﷺ) సంప్రదాయం వైపునకు మరలాలి. తొలికాలపు సజ్జనులు (సలఫె సాలిహీన్) కూడా తమ నిజ విశ్వాసం కోసం ఈ రెండు మూలాధారాలపైనే ఆధారపడేవారు. పూర్వకాలపు జనుల విశ్వాసాలు ఏ ఏ పద్ధతుల ద్వారా సంస్కరించబడ్డాయో తరువాతి వర్గాల వారి విశ్వాసాలు కూడా ఆ పద్ధతుల ద్వారానే సంస్కరించబడతాయి. దాంతోపాటే మార్గవిహీన జాతుల విశ్వాసాలేమిటో కూడా తెలుసుకోవాలి. అలాగే వారి

సందేహాలు, సంశయాలేమిటో కూడా తెలుసుకోవాలి. తెలుసుకున్నప్పుడే వాటిని నివృత్తిచేయ టానికి, వాటిని గురించి ఇతరులను సావధానపరచటానికి అవకాశముంటుంది.

(2) విద్యార్జనకు సంబంధించిన వివిధ దశలలో తొలికాలపు సజ్జనుల అఖీదా గురించి అవగాహన చేసుకునే తరగతులను ఏర్పాటు చేయాలి. వీలైతే వాటిని పాఠ్యాంశాలలో ఒక భాగంగా చేర్చాలి. ఈ సబ్జెక్టుపై నిశిత దృష్టితో పరీక్షలు నిర్వహించాలి.

(3) పాఠ్యాంశాలలో కేవలం సన్మార్గగాములైన వారి పుస్తకాలనే ఉంచాలి. మార్గవిహీనతకు లోనైన సూఫీ, ముబ్తదియ్యీన్, జహ్మియ, మోతజల, అషాఅరా తదితర వర్గాల పుస్తకాలను దూరంగా ఉంచాలి. కాకపోతే విషయాన్ని తెలుసుకునే ఉద్దేశంతో ఆ పుస్తకాలను చదవవచ్చు. ఆ పుస్తకాలలో ఉన్న సత్యవిరుద్ధమైన, అధర్మమైన విషయాలను ఖండించాలి. వాటిని గురించి ప్రజలను జాగృతపరచాలి.

(4) సత్యధర్మ బోధకులు సంస్కరణా సంకల్పంతో నడుం బిగించాలి. సలఫె సాలిహీన్ (తొలికాలపు మహనీయుల) అభిమతం గురించి క్షుణ్ణంగా ప్రజలకు విశదీకరించాలి. ఈ విధానం పట్ల విముఖత చూపేవారి మార్గవిహీనతను ఖండించాలి.